జిమ్నాస్టిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



అఫ్జల్‌గంజ్: సీబీఎస్‌సీ జిమ్నాస్టిక్స్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన సీహెచ్. డైనా గ్రేస్, సీహెచ్. డ్యానియేల్ ప్రతిభ చాటారు. మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో నగరానికి చెందిన డైనా గ్రేస్ గోల్డ్‌మెడల్, బ్రౌంజ్ మెడల్‌లు సాధించగా సీహెచ్. డ్యానియేల్ బ్రౌంజ్ మెడల్ సాధించి సత్తాచాటారు. విజేతలుగా ప్రతిభ కనబరిచిన వారిని ఆ విద్యార్థులు చదివే పాఠశాల కార్నర్ స్టోన్ స్కూల్ అభినందించింది.

'కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ముస్లింలు'



దాసోజు శ్రవణ్‌తో జరిగిన సమావేశంలో మహ్మద్ సలావుద్దీన్ లోది తదితరులు

చార్మినార్: కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడంతో ముస్లిం మైనార్టీలు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉన్నారని బీఆర్ఎస్ చార్మినార్ శాసనసభ నియోజకవర్గం ఇన్‌చార్జి మహమ్మద్ సలావుద్దీన్ లోది అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌తో జరిగిన సమావేశంలో తాను పాల్గొని ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చానన్నారు. రాబోయే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఈ అంశాన్ని పెద్ద ఎత్తున తెరపైకి తీసుకువస్తే ఆశించిన ఫలితాలు ఉంటాయన్నారు.

వైద్యులపై దాడులు అరికట్టాలి



సాక్షి, సిటీబ్యూరో: మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంపై దాడికి నిరసనగా మంగళవారం పేట్లబురుజు ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. వైద్యులపై దాడులను అరికట్టాలని నినాదాలు ఇచ్చారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



గాయత్రి దేవిగా ఉప్పగూడ మహాకాళి అమ్మవారు



గాయత్రి దేవిగా జమ్మిచెట్టు దుర్గామాత



గాయత్రి దేవి అలంకరణలో అమ్మవారు



గౌలిపురా హనుమాన్‌నగర్‌లో..



విజయనగర్‌కాలనీ లక్ష్మీగణపతి ఆలయంలో..

గాయత్రి దేవి నమోస్తుతే

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు చేశారు. రెండో రోజు అమ్మవారు గాయత్రి దేవిగా దర్శనమిచ్చారు. పలుచోట్ల సామూహిక పారాయణం, కుంకుమార్చన, చండీహోమం నిర్వహించారు.

– చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం



సిటీ కాలేజీ తాటి మైసమ్మ గుడిలో..



మొహల్లా గంజ్‌లో..



హోమంలో పాల్గొన్న మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య



గోల్కొండ కోటలో పూజల్లో శోభాపాండే, నాగన్న, తివారీ తదితరులు



గుడిమల్కాపూర్‌లో..

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

సుల్తాన్‌బజార్: కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందికి ఐదు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్క్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం కోఠి డీఎంహెచ్ఎస్‌లో టీమ్స్ ద్వారా నియమితులైన కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా మాట్లాడుతూ..మూడేళ్లగా టీమ్స్ ద్వారా నియమితులైన నర్సుల సేవలు డీఎంఈ శాఖ అధికారులు వినియోగించుకుంటున్నారని మార్చి వరకు టీమ్స్ ద్వారా వీరికి జీతాలు అందినాయని ఏప్రిల్ నుంచి డీఎంఈ పరిధి నుంచి జీతాలు అందాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం వలన జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈ విషయమై కోఠి మెటర్నిటి, సరోజినీ, ఈఎన్‌టీ, నీలోఫర్, ఉస్మానియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లను, వైద్య అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ధర్నాకు దిగాల్సి వచ్చిందన్నారు. యూనియన్ రాష్ట్ర నాయకులు ఎంఎస్ మూర్తి వెంకటయ్య, కిషన్, నర్సింగ్, ప్రమీళకుమారి, సౌదర్య, శాంతి, స్వప్న, రేవతి పాల్గొన్నారు.



సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజిలెన్స్ అవగాహన ర్యాలీ



అబిడ్స్: నిజాయితీ, పారదర్శకత, బాధ్యతాయుత విధానాలపై అవగాహన కల్పించడానికి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయ సిబ్బంది మంగళవారం వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్ మాట్లాడుతూ..సామాజిక బాధ్యతను పెంపొందించడం, పరిపాలనా విలువలను ప్రోత్సహించడం, వంటి అంశాలను లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఆగస్టు 18 నుంచి నవంబరు 17వ తేదీ వరకు మూడు నెలల పాటు విజిలెన్స్ అవేర్నెస్ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలా విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలి

యాకుత్‌పురా: ముంపు ప్రాంతాల్లో కొనసాగుతున్న నాలా విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. యాకుత్‌పురాలోని రెయిన్‌బజార్, ఎస్ఆర్టీ కాలనీ, రైల్వే స్టేషన్, తలాబ్‌కట్టా, చోట బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న నాలా విస్తరణ, డ్రైనేజీ పూడికతీత, సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన కార్పొరేటర్లు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతలమయ్యమైన రోడ్లకు ప్యాచ్ పనులతో పాటు యాకుత్‌పురా రైల్వే స్టేషన్ వద్ద రూ.4 లక్షల నిధులతో నూతన సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ పర్యటనలో తలాబ్ చంచలం, రెయిన్‌బజార్, డబీర్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు సమీనా బేగం, మహ్మద్ వసీవుద్దీన్, అలందార్ వాలాజాహి, అధికారులు పాల్గొన్నారు.



నాలా పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్లు, అధికారులు

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు

చాంద్రాయణగుట్ట: ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడిని ఫలక్‌నుమా పోలీసులు స్వల్ప వ్యవధిలో క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పోలీసుల వివరాల ప్రకారం..వట్టెపల్లి రోషన్ కాలనీకి చెందిన సయ్యద్ అమీర్ అహ్మద్ కుమారుడు సయ్యద్ హస్సం దస్తగిర్ ఖుర్సీ(4) మంగళవారం మధ్యాహ్నం ఇంటి ముందు ఆడుకుంటూ తప్పిపోయాడు. కాసేపటి అనంతరం గమనించిన కుటుంబ సభ్యులు కంగారుకు గురై పోలీసులను ఆశ్రయించారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య పర్యవేక్షణలో టీమ్‌ను ఏర్పాటు చేసి వెతకగా బాలుడు ఫలక్‌నుమా రైతుబజార్ వద్ద ఏడుస్తూ కనిపించాడు. బాలుడిని చేరదీసి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు.



గౌలిపురాను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి

గౌలిపురా: గౌలిపురాను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. బాలాగంజ్ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వెనుక బస్తీలో మంగళవారం ఆమె రూ.8.50 లక్షలతో నూతన సీసీ రోడు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..గౌలిపురా డివిజన్‌లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. డివిజన్ ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బస్తీవాసులు ఎ.మాణిక్ ప్రభుగౌడ్, ఎ.యశ్వంత్‌గౌడ్, బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షులు ఇ.సుమన్‌కుమార్ ముదిరాజ్, బీజేపీ జిల్లా మీడియా కార్యదర్శి జి.రఘుకాంత్, బీజేపీ నాయకులు కె.రాజ్ కుమార్ ముదిరాజ్, కె.శోభారాణి, సంధ్యారాణి, ఎస్.రవి, జి.నర్సింగ్, గౌలిపురా ఏఈ తేజోవంత్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

గోల్కొండ: విద్యార్థులను ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని గోల్కొండ మండల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ మహ్మద్ బషీరుద్దీన్ అన్నారు. మంగళవారం గోల్కొండ ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గోల్కొండ మండలానికి చెందిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గోల్కొండ మండలానికి చెందిన మొత్తం 28 మందిని ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిందన్నారు. వీరిలో ఏడుగురు ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారని మిగతా 21 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు అని ఆయన అన్నారు. విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి తగిన సలహాలు, సూచనలు ఉపాధ్యాయులతో పాటు ప్రధానోపాధ్యాయులు కూడా ఇస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాటు డిప్యూటీ ఐవోఎస్ కార్యాలయ సిబ్బంది జాకేర్ తదితరులున్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులతో మహ్మద్ బషీరుద్దీన్